నమస్తే తెలంగాణ





శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలోని రోటిబండతండాలో రైతులు పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకొంటున్న పోలీసులు

# ఒక ఊరు.. వందలాది పోలీసులు!

- లగచర్లలో భూ సేకరణకు మళ్లీ కాలుదువ్విన కాంగ్రెస్ సర్కారు
- ఖాకీల పదఘట్టనల నడుమ పారిశ్రామికవాడ భూ సేకరణ సర్వే
- లగచర్ల, రోటిబండ, పులిచర్లకుంట తండాల్లో 110 ఎకరాల సేకరణ
- నాలుగు బృందాలుగా మోహరించిన సుమారు 400 మంది పోలీసులు
- ప్రాణాలైనా ఇస్తాంగానీ.. భూములివ్వం
- మరోసారి తేల్చి చెప్పిన గిరిజన రైతులు



మా పొలాల జోలికి రావొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సాంజీబాయి



భారీగా పోలీసులను మోహరించడంతో కిష్టిబాయి ఆగ్రహం

కొడంగల్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ఏడాది కాలంగా సర్కారు వేధింపులను భరిస్తూ.. పోలీసుల దౌర్జన్యం, కేసులు, జైలు జీవితంతో విసిగిపోతున్న లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో మళ్లీ ఖాకీలు మోహరించారు. 'ప్రాణాలు పోయినా సరే.. భూములిచ్చేది లేదు' అని స్థానిక గిరిజన రైతులు తెగేసి చెప్తున్నా రేవంత్ సర్కారు మాత్రం కనికరించడం లేదు. నిన్నటిదాకా ఫార్మా అని చెప్పి, ఇప్పుడు పారిశ్రామికవాడ అని కొత్త రాగంతో కాంగ్రెస్ సర్కార్ భూసేకరణకు కాలు దువ్వుతున్నది. ఇందులో భాగంగా శుక్రవారం వందలాది మంది పోలీసు బలగాలతో లగచర్లకు వెళ్లిన రెవెన్యూ అధికారులు సర్వే మొదలుపెట్టారు. కొందరు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించారంటూ సర్వే మొదలుపెట్టిన అధికారులు, తాము భూములు ఇచ్చేది లేదని చెప్పిన గిరిజన రైతుల పొలాల్లోకి వెళ్లి హద్దులు నిర్ధారించుకొని సర్వే చేశారు. ఈ క్రమంలో గిరిజన రైతులు పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ సర్వేను తీవ్రంగా వ్యతిరేకించారు. 'అంగీకరించిన వారి భూములు తీసుకోండి తప్ప తాతల కాలం నుంచి నమ్ముకున్న మా భూముల జోలికి మాత్రం రావద్దు' అని తెగేసిచెప్పారు.

### బలగాలతో భూమి మీదికి..

ఏడాది నుంచి ఫార్మా కంపెనీలకు భూమిలిచ్చేది లేదని ప్రభుత్వంతో పోరాడుతున్న లగచర్ల రైతులు పోలీసు కేసులు, జైలు అంటూ నిన్నటిదాకా ఆవేదనలో ఉన్నారు. ఇప్పుడైనా కంటినిండా నిద్రపోదామనుకున్న సమయంలో శుక్రవారం ఒక్కసారిగా పోలీసు బలగాలతో అధికార యంత్రాంగం భూముల మీదికి వచ్చింది. ఉదయం 9.30 గంటలకు దుద్యాల మండల తహసీల్దార్ కిషన్‌తో పాటు పలువురు సర్వే అధికారులు పారిశ్రామికవాడ పేరిట భూముల సర్వే కోసం వచ్చారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏకంగా 400 మందికిపైగా పోలీసు బలగాలు సర్వే బృందంతో కలిసి వచ్చాయి. లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో 110 ఎకరాల భూముల సేకరణకు అధికారులు నిర్ణయించినందున ఆ మేరకు డిజిటల్ సర్వే నిర్వహించారు. మూడు బృందాలుగా విడిపోయిన సర్వే అధికారులు తొలుత లగచర్లలో సర్వే చేపట్టారు. అక్కడ కొంతమంది రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని అధికారులు చెప్పారు. ఆ మేరకు రైతులు కూడా వచ్చి తమ భూముల హద్దులు సూచించడంతో అధికారులు సర్వే పూర్తి చేశారు. మరో రెండు బృందాలు రోటిబండతండా, పులిచెర్లకుంట తండాలకు వెళ్లాయి. అయితే అక్కడ అప్పటికే గిరిజన రైతులు ప్లకార్డులతో సర్వేను తీవ్రంగా వ్యతిరేకించారు. తమ భూములు ఇచ్చేదిలేదని, ఎవరైనా ఇస్తే వారి భూమిని తీసుకోండి గాని తమ భూముల జోలికి రావద్దని అధికారులను కోరారు. అయినా పోలీసు పహారా మధ్య అధికారులు సర్వేనంబర్లు 102, 117,120, 121లోని 110 ఎకరాల్లో సర్వే చేశారు. రైతులు అడ్డుకునే ప్రయత్నం చేసినా 'మీరు అంగీకరించిన తర్వాతే భూములు తీసుకుంటాం' అని మభ్యపెట్టి సర్వే పూర్తి చేశారు. 'ప్రాణాలైనా ఇస్తాం గాని మా భూములు మాత్రం ఇవ్వం' అని సర్వే సమయంలో అధికారుల ముందు గిరిజన రైతులు నిరసన తెలిపారు.

### దౌర్జన్యంగా లాక్కుంటరా?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే తమకు భూమి కష్టాలు మొదలయ్యాయని, గత పాలకులు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి వ్యవసాయం చేసుకునేలా చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి గిరిజన రైతులపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు గుంటల నుంచి 6 గుంటల వరకు భూమి ఉన్న రైతులపై దౌర్జన్య చేసి భూములు లాక్కోవడం బాధాకరంగా ఉన్నదని వాపోయారు. ఏండ్ల కాలం నుంచి అవే భూములను నమ్ముకొని, ముంబై వంటి నగరాలకు వెళ్లి కూలి పనులు చేసుకొని వచ్చిన డబ్బుతో భూములను చదును చేసుకొని పంటలు పండించుకొని బతుకుతున్నట్టు తెలిపారు. ఎంతో కష్టపడి పంటలు పండే భూములుగా తీర్చిదిద్దుకొని ఇప్పుడు ప్రభుత్వానికి అప్పగించాలంటే ఎలా అని గిరిజన రైతులు ప్రశ్నిస్తున్నారు. సమ్మతి తెలిపిన రైతుల పొలాలను తీసుకొని తమ లాంటి రైతులను వదిలేయాలని వేడుకొంటున్నారు. భూమి కోసం కష్టాలు పడ్డామని, చివరికి కేసులతో జైలు పాలయ్యామని ఇప్పటికైనా సీఎం తమపై జాలి చూపాలని కోరుతున్నారు. పరిశ్రమలు పెట్టాలంటే తమ భూములే కావాలా? అని నిలదీస్తున్నారు. 'ఎంత వరకైనా పోతం.. భూములు ఇవ్వం' అని స్పష్టంచేస్తున్నారు.

### అసైన్డ్ భూములే అధికం

ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం సేకరిస్తామంటున్న 1250 ఎకరాల్లో నిరుపేద రైతులకు చెందిన అసైన్డ్ భూములే అధికంగా ఉన్నాయి. హకీంపేట గ్రామంలో 350 ఎకరాల అసైన్డ్, 146 ఎకరాల పట్టా భూమి ఉన్నది. లగచర్లలో 110 ఎకరాల అసైన్డ్, 497 పట్టా భూమి, పోలెపల్లిలో 73.29 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. వాస్తవానికి ఇక్కడి భూములకు మంచి డిమాండ్ ఉండటంతో పాటు పచ్చని పంటలు పండుతాయి. ఈ నేపథ్యంలో భూములు ఇచ్చేందుకు అంగీకరించిన రైతులకు నష్ట పరిహారం కింద రూ.20 లక్షల చెక్కులను అందించినట్టు అధికారులు తెలిపారు.

### మమ్ముల వదిలెయ్యండ్రి



సీఎం సారూ మా భూములు గుంజుకోడానికా నీకు ఓట్లేసి గెలిపించుకున్నది. ముసలోళ్లమైనం. ఎప్పుడూ ఇట్ల బాధలు పడలే. ఏడాది నుంచి భయంభయంగ బతుకుతున్నం. కేసులతో మా పిల్లలు జైలుకు పోయిండ్రు. ఇప్పటికైనా అయిపోయిందనుకుంటే మళ్లీ సర్వే అని సార్లు పోలీసులతోటి వచ్చిండ్రు. భూముల కాడికి ఎప్పుడెవలు వస్తరో ఏం చేస్తరోనని తిండి తినక.. కంటికి నిద్ర లేకుండ బిక్కుబిక్కుమనుకుంట బతుకుతున్నం. మమ్ముల వదిలెయ్యండ్రి..మీకు పుణ్యముంటది.

**- బాల్కిబాయి,**
భూ బాధితురాలు, రోటిబండతాండ



### భూములు పోతే చావే గతి

మా భూముల జోలికి వస్తే ఆత్మహత్య చేసుకుంటం. మాకు తిండిపెట్టే భూములు పోతే ఎట్ల బతకాలె? మా భూములను కాపాడాలని కనిపించిన అధికారినల్లా వేడుకొంటున్నం. భూముల గోడవల్లోనే కేసులై ఎంతో మంది మా పోరగాండ్లు జైలు పాలైండ్రు. అప్పట్లో కేసుల భయంతోని చెట్టూపుట్టల్ల దాక్కున్నం. బెయిల్ దొరికి మావోళ్లు ఇండ్లకచ్చినంక ఇప్పట్ల పూర్తి అయ్యిందనుకున్నం. మళ్లీ సీఎం మా మీదికి బాంబులు పేలుస్తుండు.ఇదేమన్న న్యాయమేనా సీఎం సారూ? మా మీద దయ ఉంచి భూముల జోలికి రాకుండ్రి. మా మానాన మమ్ముల బతకనియ్యండ్రి.

**- పాండునాయక్,** రోటిబండతాండ



రోటిబండతండాలోకి భారీగా పోలీసులు రావడంతో ఓ చోట గుమిగూడి చర్చించుకుంటున్న స్థానిక గిరిజన రైతులు



రోటిబండతండాలో సర్వే వద్దని రైతులు చెప్పినా వినకుండా పోలీసుల పహారాలో కొలతలు చేపడుతున్న అధికారులు

## లోకం పోకడ




రెండు చేతులా డాలర్లు సంపాదించుకొస్తాడనుకున్నాం!



డంపింగ్ యార్డ్‌కు వెళ్లే మార్గంలో పోలీసుల పహారా

# మరో లగచర్లగా ప్యారానగర్ పోరు

- డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు
- పోలీసుల దిగ్బంధంలోనే రెండు గ్రామాలు
- గ్రామాల్లో పికెటింగ్‌లు, తనిఖీలు, ఆంక్షలు
- ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని కోరిన ఎయిర్‌ఫోర్స్ అకాడమీ

సంగారెడ్డి, గుమ్మడిదల, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలోని ప్యారానగర్, నల్లివల్లి, కొత్తపల్లి గ్రామాలు మరో లగచర్లను తలపిస్తున్నాయి. డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేయాలంటూ ప్రజలు చేస్తున్న పోరాటం ఉధృతమవుతున్నది. ప్రజలు అభ్యంతరం తెలుపుతున్నా ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. నిర్బంధాలు, ఆంక్షలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామాల్లో పోలీసుల బలగాలు మోహరించాయి. డంపింగ్ యార్డ్ కోసం 2 రోజుల క్రితం వందల ట్రక్కులు, బుల్‌డోజర్లు పనులు చేపట్టింది. ముందుగా రోడ్డు, ప్రహరీగోడ ప్రారంభించింది. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. నల్లవల్లి, మంభాపూర్, కొత్తపల్లి, ప్యారానగర్, గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు గ్రామాల్లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతం ఎమర్జెన్సీ వాతావరణాన్ని తలపిస్తున్నది. శుక్రవారం నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల యువకులు, విద్యార్థులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ సర్కారు ప్రజలను నాశనం చేయడానికే కంకణం కట్టుకుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ఆందోళనకు బీఆర్‌ఎస్ నేతలు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమడవద్దని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో హైదరాబాద్‌లోని శుక్రవారం ఆయన గృహంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భేటీ అయ్యారు. డంప్‌యార్డు, ప్రజలు, రైతుల ఇబ్బందులపై చర్చించారు. కోర్టుకు, గ్రీన్‌ట్రిబ్యునల్‌కు వెళ్దామని హరీశ్‌రావు పలు సూచనలు చేసినట్టు సమావేశం తర్వాత సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. హరీశ్‌రావును కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### డంపింగ్ యార్డ్ వస్తే అధోగతే!

జంటనగరాల నుంచి రోజూ 200 నుంచి 300 ట్రక్కుల్లో చెత్తను ప్యారానగర్ డంప్‌యార్డుకు తరలించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఇదే జరిగితే హైదరాబాద్-గుమ్మడిదల రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయని, దుర్గంధం వ్యాపించి ప్రజలు ఇబ్బందిపడతారని 10 గ్రామాల ప్రజలు చెప్తున్నారు. ఇప్పటికే బొంతపల్లి, దోమడుగు, మంబాపూర్, అనంతారం పరిధిలోని రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో గుమ్మడిదల ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డంప్‌యార్డు కూడా ఏర్పాటు చేస్తే అక్కడ నివసించే పరిస్థితులు ఉండవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్ని సమస్యలను దృష్టిలో పెట్టుకుని డంప్‌యార్డు నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌ను ఆపేందుకు సహకరించాలని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు రైతులు వినతిపత్రం సమర్పించారు.

### జిల్లా కలెక్టర్, డీఎఫ్‌వోకు వింగ్ కమాండర్ లేఖ

ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అకాడమీ వింగ్ కమాండర్ శుభమ్ మిశ్రా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా అటవీశాఖ అధికారులకు లేఖ రాశారు. డంప్ యార్డ్ అకాడమీ ఫ్లయింగ్ ఏరియా పరిధిలోకి వస్తుందని చెప్పారు.

### జవహర్‌నగర్ చెత్తతో అనేక ఇబ్బందులు

మాది గుమ్మడిదల గ్రామం. జవహర్‌నగర్‌కు 12 కిలోమీటర్ల దూరంలోని దమ్మాయిగూడలో నివసిస్తున్నా. డంపింగ్‌యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగునీరు కలుషితం అవుతున్నది. ఈగలు, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. ఎలుకలు, పందికొక్కులు వస్తున్నాయి. పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మేము పడుతున్న కష్టాలు గుమ్మడిదల మండల ప్రజలు ఇబ్బందులు పడొద్దు. అందరూ కలిసి డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకించాలి.

**-దివ్య, గుమ్మడిదల**

# లాయర్ వర్సెస్ హైడ్రా కమిషనర్

## రాంగోపాల్‌నగర్ భూ వివాదంపై గరం గరం

- న్యాయవాది ముఖీమ్, కమిషనర్ రంగనాథ్ మధ్య వాగ్వాదం
- ఓవరాక్షన్ చేయొద్దంటూ ముఖీమ్‌ను హెచ్చరించిన రంగనాథ్

అమీన్‌పూర్, ఫిబ్రవరి 7 : అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ఐలాపూర్ రాజగోపాల్ నగర్, చక్రపురి కాలనీలను శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. ఆయా అసోసియేషన్ సభ్యులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. కొద్ది రోజుల క్రితం ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ప్లాట్ల వద్దకు వచ్చి బాధితులతో కమిషనర్ సమావేశం అయ్యారు. వారి ప్లాట్ల ఫిజికల్ పొజిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 1986లో 400 ప్లాట్లను చక్రపురి కాలనీ వెంచర్‌లో హుడా ఫైనల్ లేఅవుట్ వచ్చిన అనంతరం కొనుగోలు చేశామని చెప్పారు. చాలాకాలం తర్వాత పక్కనే ఉన్న సర్వే నంబర్ 153లో విజయ్‌కృష్ణరాజు అనే వ్యక్తి 53 ఎకరాలు కొనుగోలు చేసి ప్లాటింగ్ చేశారు. సదరు వ్యక్తి అధికారులు, నాయకుల అండదండలతో కుమ్మక్కై 400 ప్లాట్ల కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైడ్రా అధ్వర్యంలో సర్వే చేపట్టి పరిష్కారం చూపుతానని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఐలాపూర్‌లో బాధితులతో మాట్లాడుతుండగా ఐలాపూర్ వాసి, సుప్రీం కోర్టు న్యాయవాది ముఖీం కల్పించుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఓవరాక్షన్ చేయద్దంటూ కమిషనర్ హెచ్చరించారు.



చక్రపురి కాలనీ బాధితులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# నా కడుపుకొడితే నీకేమొచ్చింది?

## ఉపాధి పోతే ఎట్ల బతకాలే? • నన్ను కూడా ఇదే జేసీబీతో సంపెయ్యండి

- 20 ఏండ్లుగా బతుకునిచ్చిన పాలకేంద్రం కూలగొడితే నేనెట్ల బతికేది?
- ఎట్ల కూలగొట్టావో అట్లనే కట్టించి ఇవ్వు లేకుంటే నాశనమై పోతావ్.. ఇదే నాశాపం
- పేదోళ్లపై పడ్డావ్.. కాంగ్రెస్ నాశనమైపోద్ది
- కడుపుమండి సీఎంపై మహిళ శాపనార్థాలు
- హైదరాబాద్ చిలుకానగర్‌లో ఫుట్‌పాత్ నిర్మాణాలు కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ
- దిక్కులు పిక్కటిల్లేలా రోదించిన మహిళ

రామాంతపూర్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): బత్తిని రాధికాగౌడ్ అనే మహిళకు హైదరాబాద్‌లోని ఉప్పల్ చిలుకానగర్‌లోని కల్యాణపురి పార్కు వద్ద పాలకేంద్రం ఉన్నది. రోజూ ఇంటింటికి తిరిగి పాల పాకెట్లు విక్రయిస్తూ కుటుంబాన్ని సాదుకుంటుంది. ఎప్పటిలాగానే శుక్రవారం ఉదయం కూడా పాలకేంద్రానికి వెళ్లింది. జేసీబీ రూపంలో తన ఉపాధికి ముప్పు ఉన్నదని, అది ఈ రోజే అని ఆ మహిళ ఊహించనే లేదు. కానీ జీహెచ్‌ఎంసీ అధికారులు జేసీబీతో వచ్చి పాలకేంద్రంపై ఒక్కసారిగా విరుచుకపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదంటూ కూల్చివేశారు. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామంతో ఆమె ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. కండ్లెదుటే బతుకు కూలిపోతుంటే దిక్కులు పిక్కటిల్లేలా ఆమె రోదించసాగింది. ఎవ్వరైనా సాయం చేయండి.. కూల్చివేతను ఆపండి.. కన్నీటి పర్యంతమైంది. అయినా ఆ అధికారులు కనికరం చూపకపోగా, పాలకేంద్రంలోనే ఉన్న ఫ్రిజ్, ఇతర సామగ్రిని కూల్చివేతల్లో ధ్వంసం చేశారు. పాలకేంద్రం కూల్చివేతతో తన బతుకే పోయిందని ఆవేదనతో దుఃఖభారంతో సీఎం రేవంత్‌రెడ్డిపై విరుచుకుపడింది. 20 ఏండ్లుగా నమ్ముకున్న పాలకేంద్రం కూలిపోవడంతో ఎలా బతకాలంటూ భీతిల్లింది.

### పేదోళ్లపై పడ్డాడు?

'ఏయ్.. రేవంత్‌రెడ్డి.. నీకు అమ్మ, అక్క, చెల్లి ఉంటే నాలాంటోళ్లకు అన్యాయం జరగొద్దు. నీ ప్రభుత్వంతోనే మా పేదోళ్లకు కష్టాలొచ్చినయ్. నీతి, నిజాయితీ ఉంటే ఇల్లు కట్టియ్యాలే. లేకపోతే నీ పార్టీ ఉండదు. నాశనమైతది. గాజులు పగలగొట్టుకొని మన్నుపోస్తున్న. నేనిప్పుడు పెట్రోల్ పోసుకొని సస్త. నాకు న్యాయం జరగాలే. నేనొక ఆడబిడ్డను. పాల మ్ముకొని బతికేదాన్ని. నా కడుపుకొడతరా? మీ కడుపుగాల.. మీరు నాశనంగాను.. కాంగ్రెస్‌కు ఏం అన్యాయం చేసినం. 20 ఏండ్ల నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటున్నం. నా పాలకేంద్రం ఫ్రిజ్ అన్నీ నాశనం చేసిండ్రు. ఎన్ని ఇండ్లు కూలగొడుతర్రా? మీరు నాశనమైపోను. నేనేమైనా అక్రమ దందా చేస్తున్నానా? అందరికీ ఉపయోగపడే పాల వ్యాపారం చేస్తున్నా.. అని రాధికాగౌడ్ రోదిస్తూ శాపనార్థాలు పెట్టింది.



చిలుకానగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాధిక

### జేసీబీతో నన్ను సంపెయ్యండి?

'బతుకునిచ్చే మా ఉపాధిని కూల్చేస్తున్నరు.. ఇందులోనే నన్ను కూడా జేసీబీతో సంపెయ్యండి. ఇక బతకడానికి మాకు వేరే దారిలేదు. నా భర్త నాలుగేండ్ల నాడు కిడ్నీ వ్యాధితో చనిపోయిండు. నాకిద్దరు పిల్లలు. మాకే ఆధారం లేదు. కూల్చివేతల గురించి కనీసం చెప్పలేదు' అంటూ రాధికాగౌడ్ కన్నీటి పర్యంతమైంది. పెట్రోల్ బాటిల్ పట్టుకొని జీహెచ్‌ఎంసీ వాహనాల ముందు బైఠాయించింది. పేదోళ్ల గూడును కూల్చేందుకేనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. అంటూ ఆవేదన వ్యక్తంచేసింది. ఈ ప్రభుత్వం నాశనమైపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శాపనార్థాలు పెట్టింది. సామాన్యుల కడుపుగొట్టి బాజార్‌న పడేస్తే ఏమొస్తుందిరా సన్నాసి.. అంటూ రోదిస్తూ అటు అధికారులను, ప్రభుత్వాన్ని ఆమె తిట్టిపోసింది.

### స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరాలు

రాధిక ఆవేదనను చూసిన స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదోళ్ల ఉపాధిని కూలగొడితే సర్కార్‌కు ఏమొస్తదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదోళ్లకే కష్టాలు, పెద్దోళ్లంతా బాగానే ఉన్నారంటూ పలువురు తిట్టిపోశారు. చిన్నా చితక వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ఉపాధి దూరం చేస్తే మళ్లీ వాళ్లెలా బతకాలో చెప్పాల్సిన బాధ్యత సర్కార్‌కు లేదా? అంటూ ప్రశ్నించారు. ఇటువంటి సర్కార్‌ను ఎప్పుడూ చూడలేదని రాజయ్య ధ్వజమెత్తారు. రాధిక కుటుంబానికి భరోసా ఏదంటూ అధికారులను నిలదీశారు.